ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 28 మార్చి 2024



వేమూరు..

చైతన్యానికి మారుపేరు

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
బ్రాహ్మణ	1700
వైశ్య	5,500
కమ్మ	23,870
రెడ్డి	8,818
కాపు	32, 254
గౌడ	12,268
యాదవ	6,339
పద్మశాలి	6,000
నాయీ బ్రాహ్మణ	2,567
రజక	5,106
పల్లెకారు	2,116
సగర	2,150
విశ్వబ్రాహ్మణ	687
ముత్తరాజు	348
వాల్మీకిబోయ	333
వడ్డెర	825
కుమ్మర	2,355
ముస్లిం	7,350
మాల	35,628
మాదిగ	31,920
ఎరుకుల	2,791
యానాది	4,139
లంబాడీ	611

బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇక్కడ గతంలో పోటీ చేసిన వారంతా గొప్ప విద్యావంతులు. దీంతో నేతల ఖిల్లాగా వేమూరు నియోజకవర్గం ఘనత వహించింది. 1955లో ఏర్పడిన ఈ సెగ్మెంట్ ద్వారా ఇప్పటికి 15 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు చెందింది. ఇక్కడ బలహీన వర్గాల ఓట్లు కీలకం కాగా ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ గెలుపొందితే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్న సెంటిమెంట్ ఉంది. 1995లో తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొల్లూరి చంద్రమౌళి రెండు శాఖలకు యాక్టు తయారు చేశారు. ఇప్పటి వరకు ఐదుగురు న్యాయవాదులు పోటీలో విజయం సాధించడంతో పాటు వారికి ఈ సెగ్మెంట్ ఎంతగానో కలిసి రావడం జరిగింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(గురువారం)

సహారీ (ఉదయం) 4.49 (శుక్రవారం)

- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- బలహీన వర్గాల ఓట్లు కీలకం
- తొలి ఎమ్మెల్యేగా కల్లూరి
- రెండు శాఖలకు యాక్టు తయారీ
- న్యాయవాదులకు కలిసొచ్చిన సెగ్మెంట్
- 15 ఎన్నికల్లో ఐదుగురు న్యాయవాదులదే హవా



యడ్లపాటి వెంకట్రావు



నాదెండ్ల భాస్కరరావు



డాక్టర్ కొడాలి వీరయ్య చౌదరి



ఆలపాటి ధర్మారావు



ఆలపాటి రాజేంద్రప్రసాద్



డాక్టర్ సతీష్ పాల్‌రాజ్



నక్కా ఆనందబాబు



డాక్టర్ మేరుగ నాగార్జున



శరణు రామస్వామి చౌదరి



కల్లూరి చంద్రమౌళి

నియోజకవర్గ ముఖచిత్రం



వేమూరు, మార్చి 27: వేమూరు నియోజకవర్గంలో చరిత్ర కలిగిన అగ్రహార గ్రామాలతో పాటు చోళరాజులకు 400 సంవత్సరాలకు పూర్వపు ఆలయాలున్నాయి. రాజా వెంకటాద్రినాయుడు రాసిచ్చిన ఈనాం భూముల ఆదాయం ద్వారా ఆలయాలు విలసిల్లుతున్నాయి. ఐదు మండలాల్లో రెండు మండలాల పరిధి గ్రామాలు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. పలు లంక గ్రామాలు ఉండటమే కాక 80శాతం పైగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగుల ద్వారా అనేక పంటలు పండిస్తారు. కళారంగ ప్రాముఖ్యంతో పాటు రాజకీయ, విద్య, పారిశ్రామిక రంగాల్లో ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. వందలాది మంది విద్యావేత్తలు అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా రాణించడమే కాక ఉన్నత స్థాయిల్లో గుర్తింపు పొందారు. క్రీడా, సినీ రంగ ప్రముఖులు పుట్టిన గడ్డ కూడా. ఇక్కడి నుంచి పలు వాణిజ్య పంటలు రాష్ట్రేతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.

వేమూరు అసెంబ్లీ పూర్వాపరాలు

పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అమర్తలూరు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. అమర్తలూరు, వేమూరు, చుండూరు, చేబ్రోలు మండలాల్లోని కొన్ని గ్రామాలుండేవి. ఈమని నియోజకవర్గం కూడా ఉండేది. ఆ తరువాత దుగ్గిరాల నియోజకవర్గం ఏర్పడి కొల్లూరు ఆ నియోజకవర్గంలో ఉండటంతో పాటు వేమూరు మండలంలోని కొన్ని గ్రామాలు కూడా దానిలో కలిసి ఉండేవి. తదుపరి మార్పుల్లో వేమూరు, కొల్లూరు మండలాలను వేమూరు సెగ్మెంట్‌లో కలిపారు. 1955 నుంచి ఇప్పటిదాకా 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు, కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థులు రెండు సార్లు, టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు, వైసీపీ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. తొలిసారిగా 1955లో గెలుపొందిన కల్లూరి చంద్రమౌళి చట్టాలపై అవగాహన కలిగి మంత్రిగా కొనసాగుతూ నాటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం శ్రమించారు. ఇంగ్లాడ్‌లో అభివృద్ధిని గుర్తించి రాష్ట్రంలో మార్పు కోసం కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1947లో మద్రాసు ప్రావిన్స్‌లో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఒడిస్సాలోని కొంత భాగం కలిసి ఉండేది. ఆనాడు పెద్దలు చంద్రమౌళి ప్రతిభను గుర్తించి లోకల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. 1933లో ఆయన నా దేశం రాజ్యాంగం, పంచాయితీరాజ్ చట్టాన్ని రాశారన్న విషయం గ్రహించి స్థానిక స్వపరిపాలన మంత్రిగా, సహకార రంగ మంత్రిగా బాధ్యతలు ఇచ్చారు. 1952దాకా మంత్రి పదవుల్లో కొనసాగారు. 1960లో దేవాదాయ, రెవెన్యూశాఖలు అప్పగించారు.

1962లో వేమూరు నియోజకవర్గ ప్రారంభ సభ్యుడిగా, స్వతంత్ర అభ్యర్థి వెంకట్రావుపై పోటీ చేసి గెలుపొందారు. తిరిగి రెండు మంత్రి పదవులు కొనసాగించి రెవెన్యూ, దేవాదాయశాఖ చట్టంలో పెను మార్పులు తెచ్చారు. 1965నుంచి జరిగిన 12 ఎన్నికల్లో వేమూరు స్థానం నుంచి మంత్రులైన వారందరూ న్యాయవాదులు కావడం విశేషం. తెనాలి ప్రాంతంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందిన యడ్లపాటి వెంకట్రావు 1965 మధ్యంతర ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 1967 ఎన్నికల్లో గెలుపొందారు. 1972 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 1978లో కూడా గెలుపొంది మంత్రి పదవిని సాధించారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా నిలబడ్డ నాదెండ్ల భాస్కరరావుతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీపడ్డ యడ్లపాటి ఓటమి పాలయ్యారు. గెలుపొందిన భాస్కరరావు ముఖ్యమంత్రి అయి వేమూరు సెగ్మెంట్‌కు గుర్తింపు తెచ్చారు. 1985లో టీడీపీ అభ్యర్థి కొడాలి వీరయ్య గెలుపొందారు. 1989లో సీనియర్ న్యాయవాది ఆలపాటి ధర్మరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. యడ్లపాటిని ఓడించి మంత్రి అయ్యారు. 1994లో ధర్మరావుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా గొప్ప మెజార్టీ సాధించి మంత్రి అయ్యారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్‌రాజ్‌పై బరిలో దిగిన రాజేంద్రప్రసాద్ ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో న్యాయవాది నక్కా ఆనందబాబు టీడీపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి అయిన మేరుగ నాగార్జునపై గెలుపొందారు. 2014ఎన్నికల్లో ఆనందబాబు వైసీపీ అభ్యర్థిగా నిలబడ్డ నాగార్జునపై మరో సారి విజయం సాధించారు. మంత్రి వర్గ విస్తరణలో క్యాబినెట్ మంత్రిగా ఆనందబాబు పనిచేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నాగార్జునపై పోటీగా నిలిచిన ఆనందబాబు ఓటమి పాలయ్యారు. నాగార్జున క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సెగ్మెంట్ న్యాయవాదులకు ఎంతగానో కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

బరిలో అభ్యర్థులు

తాజా ఎన్నికల బరిలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా నక్కా ఆనందబాబు పేరును ఖరారు చేశారు. వైసీపీ నుంచి సంతనూతలపాడు వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు వేమూరు స్థానాన్ని ప్రకటించారు. దీంతో వీరిద్దరూ నియోజకవర్గంలో ప్రచారాన్ని కొనసాగించారు. రాష్ట్రీయ దళిత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుస్సా నాగరాజు పేరును ప్రకటించారు.

మొత్తం ఓటర్లు 1,95,756

పురుషుల ఓట్లు 94,875

మహిళల ఓట్లు 1,00,872

ఇతరుల ఓట్లు-9

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	గరికపూడి జోసెఫ్	సిపిఐ	17,428
1962	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	7,019
1965	శరణు రామస్వామిచౌదరి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	488
1967	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	4,797
1972	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	లంకపల్లి రాఘవయ్య	కాంగ్రెస్	1297
1978	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్ ఐ	కొడాలి వీరయ్యచౌదరి	జనతా	506
1983	నాదెండ్ల భాస్కరరావు	స్వతంత్ర అభ్యర్థి	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్	24,645
1985	కొడాలి వీరయ్య చౌదరి	టీడీపీ	పిఎల్‌వి ప్రసాదరావు	కాంగ్రెస్	8,116
1989	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	టీడీపీ	9,827
1994	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	10,194
1999	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	18,947
2004	సతీష్‌పాల్‌రాజ్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	8,776
2009	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	కాంగ్రెస్	2,230
2014	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	వైసీపీ	2,127
2019	మేరుగ నాగార్జున	వైసీపీ	నక్కా ఆనందబాబు	టీడీపీ	9,999



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

- 12 మంది ప్రభుత్వ ఉద్యోగులపై క్రమ శిక్షణా చర్యలు
- సీ విజల్‌లో వచ్చిన 398 ఫిర్యాదులు పరిష్కారం
- ప్రశాంత ఎన్నికలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు
- కలెక్టర్ శివ శంకర్ లోతేటి

తొమ్మిది మంది వలంటీర్లపై వేటు

నరసరావుపేట, మార్చి 27: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వ హించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన విలేకరు ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన 9 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించాం. ఐదుగురు ఔట్‌సోర్సింగ్, ఇరువురు కాంట్రాక్ట్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నాం. ఎన్నికల నియమావళి అమలులో అలసత్వం వహించిన 12 మంది ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కోడ్‌కు లోబడి ఉద్యోగులు, అధికారులు పని చేయాలని ఎటువంటి ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో 1,294 ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన గోడలపై రాతలు.. 3,713 పోస్టర్లు, బ్యానర్లు 3,310 మొత్తం 12,094 తొలగించారు. ప్రైవేట్ గోడలపై ఆయా అంశాలను 5,306 తొలగించడం జరిగిందని వివరించారు. సీ విజిల్‌పై విస్తృత అవగాహన కల్పించాం. సీ విజిల్ ద్వారా 398 ఫిర్యాదులు అందాయి. వీటిలో 94శాతం 100 నిమిషాలోపు పరిష్కరించాం. సువిధ యాప్ ద్వారా ఎన్నికలకు సంబంధించి ప్రచారం, సభలు, సమావేశాలు తదితర అనుమతుల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటి వరకు 213 దరఖాస్తులు అందాయి. వీటికి అనుమతులు ఇచ్చాం. రూ.1.12 కోట్ల విలువైన నగదు, మద్యం, ప్రచార సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాం. వీటిలో రూ.25.90 లక్షల నగదు. రూ.25.58 లక్షల విలువైన మద్యం సీజ్ చేయడం జరిగింది. సీజ్ చేసిన నగదుకు సంబంధించిన వివరాలు చూపితే నగదు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఫారం 7కు గడువు ముగిసింది..

ఓటర్ల జాబితాలో పేరు లేని వారు, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం ఏప్రిల్ 10వ తేదీ వరకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. తొలగింపులు, సవరణలకు బుధవారంతో గుడువు ముగిసిందన్నారు. ఫారం-7 అనుమతించబడవని స్పష్టం చేశారు. ఓటు బదిలీకి అవకాశం ఉందని ఇందుకు ఫారం-8 ను దాఖలు చేయాలన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని, పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత ఎన్నిలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో వినాయకం పాల్గొన్నారు.

ఉద్యోగం మానేస్తే.. రూ.20 వేలు

- వలంటీర్లు ఉద్యోగం మానేయండి..



- పార్టీ కోసం పనిచేయండి
- ఆ వేతనం పార్టీ ఇస్తుంది
- నరసరావుపేటలో మూకుమ్మడి రాజీనామాలకు వత్తిడి ?

నరసరావుపేట, మార్చి 27: వలంటీర్లు ఉద్యోగం మానేయండి.. పార్టీ కోసం పనిచేయండి.. ప్రభుత్వం నుంచి వచ్చే వేతనం పార్టీ ఇస్తుంది అంటూ అధికార పార్టీ నరసరావుపేటలోని వలంటీర్లపై వత్తిడి తెస్తోంది. ఎన్నికల పూర్తి అయ్యేవరకు పార్టీ కోసం పనిచేస్తే మళ్లీ అధికారం రాగానే వలంటీర్లు పోస్టు మీకే ఇస్తాం.. అని వైసీపీ నేతలు వారిపై వత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. రాజీనామా చేసిన ఒక్కో వలంటీరుకు రూ.20 వేలు ఇస్తామని కూడా పార్టీ నేతలు చెబుతున్నట్టు తెలిసింది. పట్టణంలోని వార్డు పార్టీ ఇన్‌ఛార్జ్‌లకు వలంటీర్లను ఉద్యోగం మాన్పించే బాధ్యతను ముఖ్యనేతలు అప్పగించినట్టు ప్రచారం జరుగుతోంది. వలంటీర్లకు ఉద్యోగం మానేయాలంటూ మెసేజ్‌లు పంపినట్టు తెలిసింది. బుధవారం పలువురు వలంటీర్లకు మెసేజ్‌లు వచ్చినట్టు వారు చెప్పకనే చెబుతున్నారు. కొందరు వైసీపీ నేతలు వారి ఇళ్ల వద్దకు పిలిపించుకొని ఉద్యోగం మానేయాలని గట్టిగానే చెప్పినట్టు ప్రచారం.

వలంటీర్ల ద్వారా ఎన్నికల ప్రక్రియ చేయాలని అధికార పార్టీ భావిస్తోందని ఇందుకు వారిని పూర్తిగా వినియోగించు కుంటున్నదని విపక్షాలు మండి పడుతున్నాయి. వలంటీర్లు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఫొటోలను కూడా రిలీజ్ చేస్తుండటం కలెక్టర్ వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇప్పటికే తొమ్మిది మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు బుధవారం కలెక్టర్ శివ శంకర్ లోతేటి వెల్లడించారు. ఈ నేపథ్యంలో వలంటీర్ల ద్వారా ఎన్నికల నిర్వహించేందుకు అన్ని విధాన అధికార పార్టీ సిద్ధం చేసుకుందన్న ప్రచారం జరుగుతోంది. వలంటీర్లపై అధికారులు చర్యలు తీసుకుంటుండంతో ఎన్నికల వ్యూహం దెబ్బతింటుందని భావించిన అధికార పార్టీ దిద్దుబాటు చర్యలు చేపట్టిందన్న విమర్శలున్నాయి. దీనిలో బాగంగానే వలంటీర్ల సేవలను ఎన్నికల్లో వినియోగించు కోసేందుకు వారి చేత ఉద్యోగం రాజీనామా చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వలంటీర్లకు రూ.5 వేలు చొప్పున పంపిణీ చేసినట్టు సమాచారం. ఇలానే ఉద్యోగం మానేసిన వారికి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రభుత్వం ఇస్తున్న జీతం తామే ఇస్తామని వార్డుల వారీగా పార్టీ బాధ్యులకు అప్పగించినట్టు తెలిసింది. దీంతో సదరు వార్డు పార్టీ బాధ్యులు వలంటీర్ల మెసేజ్‌లు పంపినట్టు చెబుతున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు లేఖ, మొబైల్ సిమ్‌ను సచివాలయం అడ్మిన్‌లకు అందజేయాలని నేతలు సదరు వలంటీర్లకు సూచించనట్టు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో వలంటీర్లు రాజీనామా బాటలో పయనిస్తారన్న ప్రచారం జరుగుతోంది. రాజీనామా చేసిన ఒక్కో వలంటీరుకు రూ.20 వేలు ఇస్తామని కూడా పార్టీ నేతలు చెబుతున్నట్టు తెలిసింది. మూకుమ్మడి రాజీనామాలకు పాల్పడితే వచ్చే నెలలో ఫించన్‌ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

- జిల్లా వ్యవసాయ అధికారి మురళి

రొంపిచర్ల, మార్చి 27: ఖరీఫ్‌లో సాగు చేసిన కందులను మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి మురళి తెలిపారు. బుధవారం రొంపిచర్లలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా రూ.9649.10 కాగా మరో రూ.74.65 కూలి, రవాణా ఖర్చులు నిమిత్తం చెల్లిస్తున్నామన్నారు. మొత్తం రూ.9723.75 రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన మూడు రోజుల వ్యవధిలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. వారం నుంచి 60 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేశామన్నారు. చివరి వరకు కంది పంటను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఆయన వెంట ఏడీఏ మస్తానమ్మ, ఏవో శివలలిత ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ మురళి



మొదటి పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు

సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు' యువతను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా. టిల్లు పాత్రను ప్రేక్షకులు హృదయాల్లో పెట్టుకున్నారు. అందుకే సీక్వెల్ అంటే మొదట భయపడ్డాను. 'టిల్లు స్క్వేర్' కోసం మా టీం అంతా శక్తికి మించి కష్టపడింది. మొదటి



పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు. ఈ సినిమాలో థ్రిల్లింగ్, షాకింగ్, సర్ప్రైజ్ అంశాలు చాలా ఉన్నాయి. మా నిర్మాత నాగవంశీ, త్రివిక్రమ్, చినబాబు గారికి ధన్యవాదాలు. నేనూ, అనుపమా కలసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారు. అమ్మాయిని అలా కామెంట్ చేయడం సరికాదు' అన్నారు. మల్లిక్‌రామ్ మాట్లాడుతూ "డీజే టిల్లు' లాగానే 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని చెప్పారు. డీజే టిల్లుకన్నా ఈ చిత్రం నాలుగురెట్లు వసూళ్లు సాధించాలని దర్శకుడు వెంకీ అట్లూరి ఆకాంక్షించారు. సిద్ధూ ఎనర్జీ లాస్ట్ ఫ్రేమ్ వరకూ ఓ రేంజ్‌లో ఉంటుంది, ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెలిపారు. సిద్ధూ ఎనర్జీ మైండ్ బ్లోయింగ్, పార్ట్ 2 డబుల్ బొనాంజా అవుతుంది అని దర్శకుడు బాబీ చెప్పారు. చిత్రబృందం సక్సెస్ పార్టీకి సిద్ధంగా ఉండాలని నీరజ కోన కోరారు.

మా అమ్మాయని రికమెండ్ చేయలేదు




మా అమ్మాయి మాళవిక మోహనన్‌ను నేనేమీ రికమెండ్ చేయలేదు. తనకు తానే గుర్తింపు తెచ్చుకుంది. నా ప్రమేయం లేకుండా నటిగా ఆమె నిరూపించుకోవాలి. ప్రస్తుతం తను విక్రమ్‌తో నటిస్తున్న 'తంగలాన్' మూవీ మంచి గుర్తింపు తెస్తుంది" అని ప్రముఖ ఛాయాగ్రాహకుడు, హీరోయిన్ మాళవికా మోహనన్ తండ్రి కె.యు మోహనన్ చెప్పారు. ప్రస్తుతం తను సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా గురించి మాట్లాడుతూ "ఇది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ వ్యక్తి తన ఫ్యామిలీ కోసం ఏం చేశాడనేది మంచి మెసేజ్‌తో చూపించాం. మంచి లవ్ స్టోరీతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు.

పెద్ద విజయాన్ని సాధించాలి



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం రత్నం అతిథులుగా విచ్చేశారు. సుమన్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి" అని కోరుకున్నారు. నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది" అని చెప్పారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ మెప్పిస్తుంది" అని చెప్పారు. "సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని నిర్మాతలు అన్నారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "డిఫెరెంట్ కాన్సెప్ట్‌తో వస్తోన్న ఈ చిత్రం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు.



రామ్‌చరణ్, కియారా జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి జరగండి జరగండి అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ సాహిత్యానికి తమన్ స్వరాలు సమకూర్చారు. దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ ఆలపించారు.

ఒక్కటైన సిద్ధార్థ్, అదితి




హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీల వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం జరిగింది. తమిళనాడు నుంచి వచ్చిన పురోహితులు వివాహ తంతును జరిపించారు. వివాహ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు స్థానిక పూజారులను కానీ, ఆలయ సిబ్బంది, స్థానికులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అనుమతించిన కొద్దిమంది సెల్‌ఫోన్లను కూడా తీసుకున్నారు. వివాహ కార్యక్రమం పూర్తయిన వెంటనే వనపర్తి పట్టణంలోని వాసుదేవమ్మ తోటలో విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ తోట వనపర్తి సంస్థానాదీశులది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాదీశుల్లో చివరిరాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనమరాలు. ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. వనపర్తి సంస్థానాదీశుల కాలంలో నిర్మించిన శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయం ఇప్పటికీ సంస్థానాదీశుల ట్రస్టు ఆధీనంలోనే ఉండడంతో పెళ్లితంతును రహస్యంగా నిర్వహించగలిగారని చెప్పవచ్చు. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీ కలసి 'మహాసముద్రం' సినిమాలో నటించారు. ఆ సమయంలోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని, 2012లో విడిపోయారు.

- మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)











సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పుల్లారావు, కూటమి నాయకులు

జగన్ గ్యాంగ్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

● బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: జగన్, అతడి రౌడీ మూకలను తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేటలో బుధవారం బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్‌లు పాల్గొన్నారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం మరింత అభివృద్ధి దిశగా ప్రయాణించాలంటూ వైసీపీ సర్కార్‌ను గద్దె దించటమే లక్ష్యంగా మూడు పార్టీ శ్రేణులు పని చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. గత టీడీపీ పాలనలో రూ.4,500 కోట్ల నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశామని, అందులో మెజార్టీ వాటానిధులు కేంద్రం నుంచే వచ్చాయని, బైపాస్ రోడ్డు వచ్చినా, అమృత్ పథకం వచ్చినా, టిడ్కో గృహాలు నిర్మించినా, సీసీ రోడ్లు వేసినా, ఎన్ఆర్‌జీఎస్ పనులు చేసినా, కేంద్రీయ విద్యాలయం వచ్చినా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తీసుకు వచ్చామని, అదే బాటలో కూటమి తిరిగి అధికారంలోకి వస్తే నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం తోట రాజా రమేష్ మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలని పిలుపు నిచ్చారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించండి

● టీడీపీ నేతలకు సూచించిన ఆర్వో శ్రీకర్

ప్రత్తిపాడు, మార్చి 27: వలంటీర్ల వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి.. ప్రతి కుటుంబానికి సంబంధించి పూర్తి డేటా మొత్తం వారి వద్దనే ఉంది.. నియోజకవర్గంలో సస్పెండైన వలంటీర్లు ఉన్నారు.. పింఛను డబ్బులు కూడా వారి చేత పంపిణీ చేయించ కుండా ఉండాలంటూ తెలుగుదేశం పార్టీ నాయులు పంచుమర్తి శేషు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్‌ను కోరారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలంటీర్ల విషయంలో తెలుగుదేశంపార్టీ నాయకులు కోరడంతో ఈ విషయం తన పరిధిలోనికి కాదని, మీ స్టేట్ లీడర్స్ చేత ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయించాలని సూచించారు. అలాగే సీ విజిల్ యాప్‌లో కంప్లైట్ చేసిన వారి వివరాలు బయటకు తెలియజేస్తున్నారంటూ శేషు ఆర్వోను ప్రశ్నించారు.

చెక్‌పోస్టులో సీసీ కెమెరాల ఏర్పాటు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్లటౌన్, మార్చి 27: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెక్‌పోస్టుల్లో రూ..6 లక్షల విలువైన 1,904 లీటర్ల లిక్కర్ సీజ్ చేశామన్నారు. అలాగే 2.70 లక్షల నగదు, ఇతర వస్తువులు మొత్తంగా రూ.9.54 లక్షలు సీజ్ చేసి కేసులు నమోదు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో 635 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. రాజకీయ పార్టీల నేతలు సువిధ పోర్టల్ టెక్నికల్ సమస్యలు మా దృష్టికి తీసుకొచ్చారన్నారు. బీఎస్పీ పార్టీ నేతలు తమకు భద్రత కల్పించాలని కోరారన్నారు. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు, ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించామన్నారు. నూతనంగా ఓటు కోసం ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటును వేరే నియోజకవర్గాలకు మార్చుకునే అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు.

పరిశీలన..మమ

● జాయింట్ వెరిఫికేషన్ అంతా జగన్నాటకం
● నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకొని ముగించిన వైనం
● కొల్లగొట్టింది కోట్లలో.. నామమాత్రంగా అపరాధ రుసుం
● ముడుపుల మత్తులో జోగుతున్న అధికారయంత్రాంగం


కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

కొల్లూరు, మార్చి 27: ఇసుక అక్రమ తవ్వకాలు ఉమ్మడి పరిశీలన అంతా జగన్నాటకంగా మారింది. ఆయా శాఖల అధికారులు బుధవారం నది ఒడ్డు నుంచే ఫొటోలు తీసుకుని పరిశీలన పూర్తయినట్లుగా మమ అనిపించారు.

పెదలంక పరిధిలోని కృష్ణానదిలో సొసైటీ భూములతో పాటు ప్రభుత్వ భూములు, రైతుల భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా గత రెండు నెలలకు పైగా సుమారు 15 నుంచి 20 అడుగుల లోతులో దాదాపు 50 ఎకరాలలో ఇసుకను కొల్లగొట్టారు. మైనింగ్ శాఖ ఈ అక్రమ తవ్వకాలు అడ్డుకోకపోగా గుత్తేదారుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని భారీ యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహించారు. ఎలక్షన్ కోడ్ రావడం, ఉన్నతాధికారులు ఎన్‌జీటీ ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారో నివేదిక ఇవ్వాలని కోరడంతో మైనింగ్ అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయించి తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తూ జాయింట్ వెరిఫికేషన్ పేరుతో ఇసుక అక్రమ తవ్వకాల పరిశీలనకు తెర తీశారు.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం జేపీ వెంచర్స్‌కు ఇసుక తవ్వకాలకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు జారీ చేసింది. మైనింగ్ అధికారులు గాజుల్లంక వద్ద కృష్ణానదిలో 4.950 హెక్టార్లలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. జేపీ వెంచర్స్ గాజుల్లంక వద్ద కృష్ణానదిలో సుమారు 200 ఎకరాల్లో ఇసుకను తవ్వేయడంతో ప్రస్తుతం అక్కడ ఇసుక రేణువు కూడా లేకుండా పోయింది. తదనంతరం రాష్ట్ర ప్రభుత్వం జీసీకేసీ సంస్థకు ఇసుక తవ్వకాల బాధ్యతలు అప్పగించింది. వారు మరొకరికి ఇసుక తవ్వకునేందుకు సబ్‌లీజ్‌కు ఇచ్చారు. సబ్‌లీజు తీసుకున్న వారు గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో పెదల్లంక వద్ద ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఉన్న ఇసుక మేటల మీద కన్ను పడింది. దీంతో రైతులకు, సొసైటీ పెద్దలకు నామమాత్రంగా నగదు చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టారు. గత రెండు నెలల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో 15 నుంచి 20 అడుగుల లోతులో ఇసుక తవ్వేసి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉమ్మడి పరిశీలనకు వచ్చిన అధికారులు తమకేమీ తెలియదన్నట్లుగా దూరం నుంచే కొన్ని ఫొటోలు తీసుకున్నారు. గాజుల్లంక కృష్ణానది నది, జువ్వలపాలెంలోని కృష్ణానది ఒడ్డుకు చేరుకుని అక్కడ కూడా తమకు కావాల్సిన ఫొటోలను సేకరించి పరిశీలన పూర్తయినట్లుగా వెళ్లిపోయారు. భట్టిప్రోలు మండలం ఓలేరులోనూ గత నెల రోజులుగా ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వాటిని కూడా మంగళవారం నుంచి నిలుపుదల చేయించిన అధికారులు అక్కడకు కూడా వెళ్లి ఫొటోలు సేకరించి పరిశీలన పూర్తయినట్లుగా వెళ్లిపోయారు. ఉమ్మడి పరిశీలనలో మైనింగ్ శాఖ జియాలజిస్టు ఫణిరాజ్‌కుమార్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జాన్ ప్రదీప్, భూగర్భ జల వనరుల శాఖ సాంకేతిక నిపుణురాలు వసంతకుమారి, తహసీల్దార్ పుల్లారావు, ఆర్ఐ త్రివేణి, నదీ పరిరక్షణ శాఖ ఏఈ సురేష్‌కుమార్, సబ్ ఎస్ఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లగొట్టింది కోట్లలో.. అపరాధ రుసుం లక్షల్లో..

ఇసుక అక్రమ తవ్వకాల ద్వారా గుత్తేదారులు కోట్లు గడిస్తే మైనింగ్ శాఖాధికారులు మాత్రం కొల్లూరు మండలం గాజుల్లంకలో కేవలం రూ.3 లక్షల అపరాధ రుసుం విధించినట్లుగా మైనింగ్ శాఖ ఏడీ రాజేష్‌కుమార్ సోమవారం ఓ దినపత్రికకు ప్రకటన ఇచ్చారు. జాయింట్ వెరిఫికేషన్ కోసం బుధవారం ఆయా శాఖల అధికారులు పరిశీలనకు వస్తే ఏడీ మాత్రం ఎటువంటి కొలతలు లేకుండా ఎంత విస్తీర్ణంలో అక్రమంగా తవ్వేశారో తెలియకుండా, ముందుగానే ఏమీ పరిశీలించకుండానే అపరాధ రుసుం ప్రకటించడం వెనుక మర్మమేమిటో ఆయన చెప్పాల్సి ఉంది. గత రెండు మూడు నెలలుగా గాజుల్లంక పరిధిలో ఇసుక లేకపోవడంతో గుత్తేదారులు పెదల్లంక పరిధిలో అక్రమ తవ్వకాలు సాగిస్తే మైనింగ్ ఏడీ మాత్రం గాజుల్లంక పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లుగా చెబుతూ నామమాత్రంగా అపరాధ రుసుం విధిస్తే, మళ్లీ కొల్లూరు మండలంలోని పెదలంక, గాజుల్లంక, జువ్వలపాలెం గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లను బుధవారం ఉమ్మడి పరిశీలన బృందం ఎందుకు వచ్చిందో వారికే తెలియాలి. వారు కూడా ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయో తెలియకుండానే, ఎటువంటి కొలతలు వేయకుండానే తూతూ మంత్రంగా పరిశీలన చేసి వెళ్లిపోవడం గమనార్హం. ఫిబ్రవరి 7వ తేదీన గ్రీన్ ట్రిబ్యునల్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42 ఇసుక రీచ్‌లలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిషేధిస్తూ కూలీలతో ఇసుక తవ్వకాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ ఎక్కడా అమలు చేయకపోవడంతో ప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలపై తీసుకున్న చర్యలు గురించి మళ్లీ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించడంతో ఓలేరు, పెదలంక పరిధిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను ఎట్టకేలకు మైనింగ్ అధికారులు నిలుపుదల చేయించి తమకేమీ తెలియదన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

అందుకే జగన్‌ను ఓడించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు


విలేకరులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి 27: దాదాపు ఎనభైశాతం శాతం హామీలు ఎగ్గొట్టినందుకు జగన్ పార్టీని ఓడించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యనిషేదం హామీపై మాటతప్పి మడమ తిప్పాడని, నాసిరకం మద్యం పోసి 35 లక్షల మంది ఆరోగ్యాల్ని నాశనం చేశారని, లివర్, కిడ్నీలు చెడిపోయి 30 వేల మంది ప్రాణాలు పోయి వారి భార్యల మాంగల్యాలు మంటగలిపి నందుకు జగన్‌పార్టీని ఓడించాలన్నారు. విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి రూ.64 వేల కోట్లు భారం మోపాడని, నిరంతర కరెంట్ కోతలతో ప్రజలను తీవ్రంగా అల్లాడిస్తున్నాడన్నారు. స్మార్ట్‌మీటర్లు, వ్యవసాయ మోటార్లకు మీటర్ల కొనుగోళ్ళలో రూ.15 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పాడు, మోగా డీఎస్సీని దగా డీస్సీ చేశాడని, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీకి మడమ తిప్పాడన్నారు. ప్రాజెక్టులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తానన్న హామీపై మాట తప్పాడని, పోలవరం నిర్వాసితులకు రూ.19లక్షలు ఇస్తానన్న హామీపై మాట తప్పాడని విరుచుకుపడ్డారు. కాంట్రాక్టు ఉద్యోగులందర్ని క్రమబద్ధీకరి స్తానన్న హామీపై మాట తప్పాడన్నారు. ఇలా 85శాతం హామీలు అమలు చేయకుండా 99శాతం చేశానని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి

విధుల నుంచి తొలగింపు

● ఆంధ్రజ్యోతికి స్పందన

మాచర్లటౌన్, మార్చి 27: పురపాలక సంఘంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న జి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. వాటర్ సప్లయి విభాగంలో ఎలక్ట్రికల్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ వెంకటదాసు విచారణ జరిపి శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

ఇద్దరు వలంటీర్లను కూడా.. అలాగే ఇరువురు వలంటీర్లు కోట రాజేష్, కందుకూరి మధులను కూడా విధులు నుంచి తొలగించినట్లు కమిషనర్ వెంకటదాసు చెప్పారు. వీరు బ్యాంకుకాలనీ సచివాలయం, కోర్టు బజారు సచివాలయాల్లో వలంటీర్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వైసీపీకి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నందున ఫ్లయింగ్‌స్క్వాడ్ నివేదిక ఆధారంగా విచారణ జరిపి విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.


పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భాష్యం హనుమంతురావు

కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

● భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ హనుమంతరావు
● నూతన భవనసముదాయానికి రూ.50 లక్షల భారీ విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి27: పేద బాలికల విద్యను ప్రోత్సహిస్తూ వారికి అండగా నిలిచిన కమ్మజన సేవాసమితి సేవలు అభినందనీయమని భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అన్నారు. గుంటూరు, జేకేసీ రోడ్డులో నిర్మిస్తున్న కమ్మ బాలికల వసతి గృహానికి భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. బుధవారం కేజేఎస్ఎస్ పాలక వర్గ సభ్యులకు భాష్యం హనుమంతురావు ఆ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాతలకు పేద విద్యార్థినులకు మధ్య వారధిలా కమ్మజన సేవాసమితి పనిచేస్తుందని కొనియాడారు. నూతన భవన సముదాయంలో తామూ భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. సమితి అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ భారీవిరాళాన్ని అందజేసిన భాష్యం రామకృష్ణను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు ఘంటా పున్నారావు, భాష్యం రామకృష్ణ కుమారుడు భాష్యం సాకేత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దొంగలు అరెస్టు

● ఎనిమిది ద్విచక్రవాహనాలు, కారు స్వాధీనం

భట్టిప్రోలు, మార్చి26: వాహనాల దొంగల ముఠా ను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 8 బైక్‌లు, 1 ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు రేపల్లె డీఎస్పీ టీ.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం భట్టి ప్రోలు పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడిస్తూ.. పల్నాడుజిల్లా బొల్లాపల్లి మండలానికి చెందిన నలుగురు భట్టిప్రోలు పరిసర గ్రామాల్లో ఇన్నోవా కారులో సంచరిస్తూ మోటార్ సైకిళ్ళను దొంగిలించుకుపోతున్నారు. అలాగే కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం, భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు 2 బైక్‌లను దొంగిలించారన్నారు. ఈ దొంగలను అదుపులోకి తీసుకొని వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన భట్టిప్రోలు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఇతర సిబ్బందికి రివార్డు నిమిత్తం ఎస్పీకి రిపోర్టు చేయ నున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వేమూరు సీఐ పి. రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


బీసీ డిక్లరేషన్‌కరపత్రాలు ఆవిష్కరిస్తు, యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి27: గతంలో టీడీపీ హయాంలో బీసీలకు గుర్తింపు, గౌరవం, పదవుల కేటాయింపులో న్యాయం జరిగిందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీడిక్లరేషన్ కరపత్రాలను యరపతినేని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు టీడీపీ తీసుకురాగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక 10శాతం రిజర్వేషన్లను తగ్గించటం వలన రాష్ట్రంలో ఎందరో బీసీలు పదవులకు దూరమయ్యారని చెప్పారు. బీసీల కార్పొరేషన్ నిర్వీర్యం చేయటంతో రాష్ట్రంలో ఆర్థిక వెనుకబాటుకు గురయ్యారన్నారు. ముందుగా టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాలర్పించారు. కార్యక్రమంలో తురక వీరాస్వామి, సయ్యద్ అమీర్‌ఆలీ, గండికోట వెంకటేశ్వర్లు, వలేపు రామకృష్ణ, బత్తుల శ్రీను, షేక్ ఖాసిమ్‌సైదా, చింతల అజయ్, నాగరాజు, యర్రగని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త

బలసానికి షోకాజ్ నోటీస్

ప్రత్తిపాడు వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. ఇటీవల వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో పాటు అక్కడ జరిగిన గొడవల నేపథ్యంలో కిరణ్ కుమార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు ఆర్వో తెలిపారు. అక్కడ జరిగిన గొడవకు సంబందించి అందరినీ బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమావలి ప్రకారం ఏదైనా రాజకీయ పార్టీ నాయకులు ప్రచారాల్లో నింబంధనలు ఉల్లంగిస్తే ఆ ప్రచారానికి సంబందించి పర్మిషన్ తీసుకున్న వారే బాధ్యులవుతారని శ్రీకర్ తెలిపారు.


కోనఫలంలో శంఖారావ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

వైసీపీని ఓటు ద్వారా తరిమికొట్టాలి

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మార్చి 27: వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసేందుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీఓటు హక్కు ద్వారా తరిమికొట్టాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలం గరువుపాలెం గ్రామంలో కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్ళ కాలంలో అవినీతి అరాచకాలే తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు పావలా ఇచ్చి జగన్ అండ్ కో దోచుకుతిన్నారన్నారు. సామాన్య ప్రజలపై అధికబారం మోపి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించారన్నారు. రాష్ట్రంలో విపరీతంగా యువతను నాశనం చేసే విధంగా గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్నారన్నారు. ఏటా విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్న జగన్ ఐదేళ్ళలో ఒక్క జనవరిలో కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. పూజారిపై వైసీపీ నాయకులు దాడి చేసి హేయమైన బూతులు తిట్టటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, గూడపాటి శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, కొలసాని రాము, తదితరులు పాల్గొన్నారు.

తరగతులు, పరీక్షలను

5వ సెమిస్టర్‌లోనే నిర్వహించాలి

పెదకాకాని, మార్చి 27: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెండేళ్లుగా బీఏ, బీకాం, బీబీఏ విద్యార్థులకు 5వ సెమిస్టర్‌లో ఇంటర్నషిప్, ఆరో సెమిస్టర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారని వారికి ఐదవ సెమిస్టర్‌లోనే తరగతులు పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. బుధవారం విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లెక్చరర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నాగరాజు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు

వైసీపీ అరాచక పాలన పోవాలి

● 1562 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 27: అమరావతికి వెలుగు, పూర్వవైభవం కలగాలంటే వైసీపీ అరాచకపాలన పోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు రాజధాని కొన్ని గ్రామాలలో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు జరుగుతున్నాయి. బిల్డ్ అమరావతి అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1562 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మహిళలు మాట్లాడుతూ విజనరీ ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే రాష్ట్ర బాగుపడుతుందన్నారు. మూడు రాజధానులతో రాష్ట్రాన్ని సీఎం జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడని ఆరోపించారు. మహిళలని చూడకుండా శాంతియుతంగా ఉద్యమం చేస్తుంటే పోలీసులతో కొట్టించి బూటుకాళ్లతో డొక్కలో తన్నించారన్నారు. న్యాయం చేయమని నిలదీస్తే అక్రమ కేసులు పెట్టి జైల్లో పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలన కన్నా దారుణంగా రాష్ట్ర రాజధానికి భూములిచ్చిన రైతుల పట్ల జగన్‌రెడ్డి వ్యవహరించారన్నారు. బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.

14న ఫర్టిలైజర్స్, సీడ్ డీలర్స్ అసోసియేషన ఎన్నికలు

గుంటూరు సిటీ, మార్చి 27: ఆంధ్రప్రదేశ్ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఏప్రిల్ 14న జరగనున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని అరండల్ పేటలో ఉన్న ఫర్టిలైజర్స్ అండ్ ఇన్సెక్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఎన్నికల కార్యక్రమం జరుగుతుందని వెంకట నాగిరెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

1,10,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,14,185 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,10,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 83,570 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000
నెంబరు. 5	10000	17000
273	9500	21000
341	9000	19500
4884	10000	16000
సూపర్ 10	10000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21500
బ్యాడిగి	9000	20000
దేవనూరు డీలక్స్	9000	18500
తెల్లకాయలు	5000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి బ్రహ్మారెడ్డి, వేదికపై బీజేపీ నేతలు

అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొడదాం..

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్ల టౌన్, మార్చి 27: అవినీతే పరమావధిగా ప్రజాధనాన్ని లూటీ చేసిన వైసీపీ నేతలను తరిమికొడదామని, ఆ ప్రభుత్వాన్ని గద్దెదించుదామని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ నేతల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి సభ్యులు కలిసి ఎటువంటి పొరపచ్చాలు లేకుండా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పల్నాడు ప్రాంత ప్రజలకు తాగునీరు, సాగునీరు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కలిసి పనిచేయాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోక సుధాకరబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే పీఆర్కే హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, వారి అరాచకాలను ఎన్నికల్లో ఓటు ద్వారా తిప్పికొట్టాలని అన్నారు. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, బీజేపీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు పునుగుల రవిశంకర్, గుమ్మడి కోటేశ్వరరావు, మక్కెన శ్రీనివాస్‌యాదవ్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో ఓర్సు క్రాంతికుమార్, జక్కా సీతారామయ్య, గుమ్మడి నాసరయ్య, శెట్టి హనుమంతురావు, కేతబోయిన హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

మాచర్లరూరల్, మార్చి 27: పట్టణంలోని 30, 31వ వార్డు వినాయకుని గుట్టలో వైసీపీకి చెందిన 50 ఎస్సీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, కొమెర దుర్గారావు, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, పేరువాల పుల్లారావు, మాచర్ల వాసు, బాదన్ బాయి, నక్షత్రపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాల్సినవారే దాడులు చేస్తున్నారు

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి

కారంపూడి, మార్చి 27: ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలే ప్రజలపై దాడులు చేస్తున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చినగార్లపాడు నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి తిరిగి ఓటును అభ్యర్థించారు. అనంతరం జరిగిన సభలో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజలకు రక్షణ కరువైందన్నారు. రాష్ట్రం, ప్రజలు అన్నివిధాలా నష్టపోయారన్నారు. చంద్రబాబు ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటే రాజధాని నిర్మాణం జరిగి ఉండేదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటు వేసి గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఓటరూ అండగా ఉండాలన్నారు. అనంతరం బ్రహ్మారెడ్డిని గ్రామ మాజీ సర్పంచ్ వజ్రాల నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, బోల్నేడి శ్రీనివాసరావు, గోళ్ల సురేష్‌యాదవ్, పంగులూరి పుల్లయ్య, చావా వీరాంజినేయులు, సీనియర్ నేత కర్ణ అమర సైదారావు, బాలునాయక్, కాల్వ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ 6 పథకాలతో ప్రతి ఒక్కరికి లబ్ధి

దుర్గి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన సూపర్ 6 పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన దుర్గిలో బొజ్జా నరసింహారావు గృహంలో టీడీపీ నేతలతో బ్రహ్మారెడ్డి సమావేశమై మాట్లాడుతూ సూపర్ 6 పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాయని, ఆయా పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జానకి రామయ్య, సింగు నాగేశ్వరరావు, పసుమర్తి బుజ్జి, పగడాల చెన్నకేశవ, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చిన చెన్నయ్య, లింగా పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జడ్జి సాల్మన్‌రాజుకి ఘన నివాళి

సత్తెనపల్లి, మార్చి 27 : సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి పదవీ విరమణ పొందిన సాల్మన్‌రాజు మరణం బాధాకరమని పలువురు న్యాయవాదులు అన్నారు. బుధవారం బార్ అసోసియేషన్ హాల్లో సాల్మన్ రాజు సంతాప సభ నిర్వహించారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ సాల్మన్‌రాజు మృతి న్యాయవ్యవస్థకు తీరనిలోటని అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జోర్నాలలో జరుగుతున్న ఆయన అంత్యక్రియలకు పలువురు న్యాయవాదులు తరలి వెళ్ళారు. కార్యక్రమంలో దాసరి జ్ఞానరాజ్‌పాల్, సయ్యద్ అబ్దుల్ రహీం, కన్యదార హనుమయ్య, చిన్న మణిబాబు, జొన్నలగడ్డ విజయ కుమార్, కే అనీల్ కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి తోడ్పడింది టీడీపీనే..

● 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో టీడీపీ నేతలు

మాచర్లటౌన్, మార్చి 27: రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి తోడ్పడింది టీడీపీనే అని ఆ పార్టీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో బుధవారం జరిగిన 'బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ'లో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీలకు క్రిస్మస్‌తో ఫాలను అందించారన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య ద్వారా ఎస్సీ విద్యార్థులను విదేశాలకు పంపించారన్నారు. చర్చి ఫాదర్లకు జీతాలు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించారన్నారు. టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిలను అధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో కోమటి వీరేశ్వరరావు, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, షైనా, సంతోష్‌రావు, మాదినేని శాంతి, మంజుల పెద అంజి, నక్షత్రపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు పర్యటన

విజయపురిసౌత్, మార్చి 27: మాచర్ల మండలం చింతలతండాలో గురువారం జరగనున్న టీడీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారునాయక్ అన్నారు.బుధవారం విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ దుర్మార్గపు ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పీఆర్కే దుర్మార్గాలు, దోపిడీలు, దౌర్జన్యాలకు అడ్డులేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు, గుండాల శ్రీనివాస్, సైదారావు, పసుపులేటి బ్రహ్మానాయుడు, సుధాకర్‌రెడ్డి, జల్లెల కొండలు, ఆడెపు కోటయ్య, కట్టా రాజు, రాంచంద్, గంటా ధనుంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

గురజాలటౌన్, మార్చి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ బాలకృష్ణ అన్నారు. మండలంలోని పులిపాడుతోపాటు గురజాల పట్టణంలో బుధవారం పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు కవాతు జరిపాయి. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గొడవలకు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీసీ సంక్షేమ సంఘం

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జగదీష్

విజయపురిసౌత్, మార్చి 27: బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోనెల జగదీష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయపురిసౌత్‌లో బుధవారం సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జింకల నాగేశ్వరరావు నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీమవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాసుకి ఓటు అడిగే హక్కు లేదు

● ఐదేళ్లలో వైసీపీ నేతలు అక్రమంగా కోట్లు గడించారు
● వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు
● రాష్ట్రాన్ని గాడినపెట్టాలంటే చంద్రబాబు సీఎం కావాలి
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని



సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మార్చి 27: గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లాగా ప్రకటించలేని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి గురజాల నియోజకవర్గ ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణమండపంలో బూత్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. తొలుత ఇటీవల మృతిచెందిన టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, గుంటుపల్లి నాగేశ్వరరావుకు నివాళులర్పించారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆగిన అభివృద్ధి ముందుకు సాగాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వైసీపీ అన్యాయం చేసిందన్నారు. చంద్రన్న బీమా రద్దు చేయడంతో కరోనా సమయంలో అశువులు బాసిన కుటుంబాలకు ఆదరవు లేకుండా పోయిందన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ 6 పథకాలతో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. టీడీపీ ఇచ్చే ఉచిత సిలిండర్లతోపాటు తాను ప్రత్యేకంగా ప్రతి కుటుంబానికి ఒక గ్యాస్ సిలిండర్ ఇస్తానని ప్రకటించారు. ముస్లింల హజ్ యాత్రకు రూ. లక్ష, క్రిస్టియన్ సోదరులు వేళంగిణి యాత్రకు సహకరిస్తానన్నారు. అధికారానికి గెలుపు వాకిటకు దగ్గరకు వచ్చాం.. ఈ 50 రోజులు మరింత కష్టపడి పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మన పనితీరును మరింతగా మెరుగుపరుచుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఓటు అడగండి.. ప్రజలు మనకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని యరపతినేని అన్నారు. ఈ ఐదేళ్లలో వైసీపీ నేతలు అక్రమ మైనింగ్ క్వారీలు, ఇసుక దందాలు, పేకాట, గంజాయి అమ్ముకొని కోట్లు గడించారన్నారు. వైసీపీ నేతల అక్రమ సంపాదన కోసం తవ్విన క్వారీ గుంతల్లో 9 మంది చిన్నారులు అశువులు బాసారన్నారు. గ్రామాల్లో టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకులను హత్య చేయించారన్నారు. రక్తపు కూడు తింటున్న కాసు మహేష్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గురజాల నియోజకవర్గంలో 1.50 లక్షల మందికి చంద్రన్న బీమాను అందిస్తామన్నారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థికమైన భరోసా అందుతుందన్నారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, అక్కినపల్లి బాలయ్య, నర్రా పుల్లయ్య, వేముల తిరుమలకుమార్, చింతపల్లి హసన్ అహ్మద్, మందపాటి దుర్గారావు, బెల్లంకొండ బద్రి, తురకా వీరస్వామి, అంబటి మల్లి, నలబోతుల శ్రీను, వేముల తిరుమల కుమార్, రుద్రాల అచ్చారావు, నెల్లూరి రామకోటయ్య, వేముల వినోద్ రెడ్డి, బుర్రి కొండలు, కల్లూరి రాఘవ, కోరె వేళంగిరాజు, కూరాకుల నాగేశ్వరరావు, బుర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 100 కుటుంబాలు

దాచేపల్లి, మార్చి 27: మండలం కృష్ణానది తీరాన ఉన్న భట్రుపాలెంకు చెందిన సుగాలీలు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. బుధవారం భట్రుపాలెంకు చెందిన లాలునాయక్, భుక్యా సైదానాయక్, మాఢావత్ హనుమానాయక్, సోమ్లానాయక్, నాగునాయక్ టీడీపీలో చేరారు.

పిడుగురాళ్ల : గురజాల మండలం దైద గ్రామానికి చెందిన రజిక సామాజిక వర్గాలకు చెందిన వారు, పిడుగురాళ్ల పట్టణంలోని 33, 1వ వార్డుల్లోని చెంచు సామా జిక వర్గానికి చెందిన 20 కుటుంబాల వారు, 33వవార్డుకు చెందిన 20 కుటుంబాలవారు, దాచేపల్లి మండలం బట్రుపాలెం గ్రామానికి చెందిన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వీరందరికి యరపతినేని శ్రీనివాసరావు టీడీపీ కండువాలుకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, తురక వీరాస్వామి, మల్లెల ఆదినారా యణ, బత్తుల శ్రీను, ఎల్‌వీఆర్, కామేశ్వరరావు, బెల్లంకొండ బద్రి, తగెల శ్రీను ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.


యరపతినేని సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న భట్రుపాలెం గ్రామస్థులు

ఎన్నికలకు సమాయత్తం కావాలి

● కూటమి శ్రేణులకు కన్నా లక్ష్మీనారాయణ పిలుపు
● నియోజకవర్గ పరిధిలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 27: సత్తెనపల్లి నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు ఎన్నికలకు సమాయత్తం కావాలని కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో బుధవారం నియోజకవర్గ స్థాయి క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో కన్నా సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, సూపర్ 6 పథకాలను ప్రజలందరికి తెలియజేయాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో, నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు 46 రోజుల పాటు ప్రజల వద్దకు వెళ్ళి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అలాగే టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో జయహో బీసీ కార్యక్రమాన్ని గ్రామంలోని నాయకులంతా ఐక్యంగా నిర్వహించాలని కన్నా సూచించారు. సమావేశంలో టీడీపీ నేతలు ఎలినేడి రామ స్వామి, ఆళ్ళ సాంబయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, కటకం రామకృష్ణ, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, నాదెండ్ల సత్యనారాయణ, పోట్ల ఆంజనేయులు, ఆళ్ళ అమరేశ్వరరావు, మార్కెట్ రాజు, కట్టా రమేష్, అన్నదాసు వెంకట్రామయ్య, గద్దె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

11 కుటుంబాలు టీడీపీలో చేరికలు..

ముపాళ్లకు చెందిన 11ముస్లిం కుటుంబాలు బుధవారం పల్నాడు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి కన్నాలక్ష్మీనారాయణ సమక్షంలో పార్టీలోచేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధ్యాన్యం ఇస్తామని కన్నా తెలిపారు. కార్యక్రమంలో ముపాళ్ల మండలపార్టీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, ఆళ్ల సాంబయ్య తదితరులు ఉన్నారు. ముపాళ్ల మండలం బొల్లవరంకు చెందిన వైసీపీ ఎస్సీ సెల్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. కన్నా వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. వారిలో బొక్క విజయబాస్కర్, గోవర్ధన్, శివయ్య, సుధాకర్, అచ్చుతరావు, అజయ్‌ఉన్నారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంగీతరావు, ముపాళ్ల మండాలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య

కారంపూడి, మార్చి 27: వృద్ధురాలు దారుణ హత్యకు గురైన సంఘటన మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామ శివారులో గల పోతురాజు కాలనీలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఆరె లక్ష్మమ్మ (80) పదేళ్లుగా కాలనీలో ఒంటరిగా జీవిస్తోంది. బుధవారం ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామాంజినేయులు కాలనీకి చేరుకొని ఇంట్లోకి వెళ్లిచూడగా వృద్ధురాలు గాయాలతో మరణించివుంది. హత్యకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ విద్యార్థికి ఆర్థికసాయం

పెదకూరపాడు, మార్చి 27 : పెదకూరపాడుకు చెందిన సాఫ్ట్‌వేర్ విద్యార్థి చిన్నప్రవీణ్ తెలుగు యువత మండల నాయకులు మేదరమెట్ల సౌమిత్ సహకారంతో రూ.10వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. మండలంలోని లింగంగుంట్లలో జరిగిన ఈ కార్యక్రమంలో సౌమిత్ తండ్రి మేదరమెట్ల శ్రీనివాసరావుకి నగదును అందించి కష్టపడి చదవాలని ప్రవీణ్‌కు సూచించారు.

పీహెచ్‌సీలో జిల్లా వైద్యాధికారి తనిఖీ

ముప్పాళ్ళ మార్చి 27: ముప్పాళ్ళ ప్రాథమిక వైద్యశాలను జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ బీ.రవి మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రి తలుపులు మూసిఉండటం, విధుల్లో ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేవారు. 24 గంటల ఆస్పత్రిలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండగా ఒక్కరూ డ్యూటీలో లేకపోవడం ఏంటని డాక్టర్ జయకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై డాక్టర్ జయకృష్ణను వివరణ కోరగా ముగ్గురులో ఒకరు సెలవులో ఉన్నారని తెలిపారు.

పోలీసుల కవాతు

కారంపూడి, మార్చి 27: మండలంలోని పేటసన్నిగండ్లలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరుగనున్న ఎన్నికల సందర్భంగా గ్రామంలో అలజడులకు దిగితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ పల్లపు రాజు హెచ్చరించారు. ఈ కవాతులో సీఐ చిన మల్లయ్య, ఎస్ఐ రామాంజినేయులు పోలీసు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థిని మృతి


చిలకా చిన్నారి (ఫైల్)

క్రోసూరు, మార్చి 27 : మండలంలోని నాగవరం హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న చిలకా చిన్నారి (15) బుధవారం గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన చిలకా సుబ్బయ్య ఏకైక కుమార్తె చిన్నారి బుధవారం బృగుబండ పరీక్షా కేంద్రంలో 10వ తరగతి పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. అనంతరం కొద్ది సమయానికే అశ్వస్థతకు గురైంది. స్థానికంగా ప్రథమచికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యంకోసం సత్తెనపల్లికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మరణించింది. చిన్నారి చాలాకాలంగా గుండెజబ్బు ఉందని, ఒక్కసారిగా గుండెపోటు రావంతో మరణించిందన్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎంఈవో చిన్నారి మృతికి సంతాపం తెలిపారు.

కార్యకర్తల మృతికి కన్నా నివాళి

సత్తెనపల్లిరూరల్, మార్చి 27: మండలంలోని పాకాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త తేటనీళ్ళ భార్గవి, భీమవరం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త చెరుకూరు సాంబశివరావులు మృతి చెందారు. స్థానిక నేతల ద్వారా సమాచారం తెలుసుకున్న గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు బుధవారం వారి గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కళాకారులకు తప్పెట్ల పంపిణీ

అచ్చంపేట, మార్చి 27: మండలంలోని చెరుకుంపాలెం ఎస్సీ కాలనీలో స్నేహహస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే తప్పెట్లను గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు తుమ్మా శౌరిరెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ తప్పెట్లను ఉపయోగించుకొని ఉపాధి కల్పించుకొని కుటుంబ పోషణకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మన్నెం భద్రయ్య, శ్రీరామోజీ సాంబశివరావు, కందుల దశరథ రామయ్య, స్నేహ హస్తాల కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి..

సత్తెనపల్లి, మార్చి 27: రాష్ట్రాభివృద్ధి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 9, 10 వార్డుల పరిధిలోని ప్రధాన రహదారి, బస్టాండ్ ప్రాంతంలో కన్నా లక్ష్మీనారాయణ బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, కటకం రామకృష్ణ, బలిజేపల్లి సురేష్‌కుమార్, నూర్‌బాషా జానీబాబు, ఇబ్రహీం, చుక్కపల్లి శ్రీను, కొండలు, ఉల్లం సురేష్, మర్రి వెంకట రామిరెడ్డి, మదమంచి రాంబాబు, ఆతుకూరి నాగేశ్వరరావు, భీమినేని వందనాదేవి, మన్నవ శారద, ఎలినేడి లక్ష్మీతులసీ, గుంటుపల్లి నాగేశ్వరరావు, పత్తిపాటి హరేకృష్ణ, కరిముల్లా, సయ్యద్ మాబూ, డీ బాపయ్య చౌదరి, పలువురు టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.


బస్టాండ్ సెంటర్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి కన్నా

నరిగమ్మ మృతికి కన్నా నివాళి

రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దుడ్డు నరిగమ్మ ఇటీవల మృతిచెందారు. బుధవారం ఉప్పలపాడు గ్రామంలో నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి కన్నా హాజరై నరిగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు.


పెదపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

రాష్ట్రానికి చంద్రబాబు కావాలి

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
● గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం

అచ్చంపేట, మార్చి27 : రాష్ట్ర ప్రగతిని పట్టాలెక్కించాలంటే సమర్ధవంతమైన నాయకత్వం అవసరమని, చంద్రబాబునాయుడు లాంటి దార్శనికత కలిగిన నాయకుడే రాష్ట్రానికి అవసరమని పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని పెదపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబు నాయుడు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు టీడీపీ వైపు కదులుతున్నారన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోనూ వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతుందన్నారు.

15 ఎస్టీ కుటుంబాలు టీడీపీలో చేరిక ..

పెదపాలెంలోని 15 ఎస్టీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ప్రతి ఒక్కరు టీడీపీ గెలుపు కోసంకృషి చేయాలని భాష్యం ప్రవీణ్ వారికి సూచిచంఆరు. కార్యక్రమంలో మండల, గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మిట్టపాలెం, కొండూరు, నిండుజర్ల గ్రామాల నుంచి పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారని ప్రవీణ్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్

టీడీపీలోనే బీసీలకు అత్యున్నత స్థానం

● జయహో బీసీ కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, మార్చి 27: రాష్ట్రంలో బీసీలకు అత్యున్నత స్థానం కల్పించింది టీడీపీయేనని పెదకూరపాడు కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీసీలకు డిక్లరేషన్ ప్రకటించటంపై ముందుగా ప్రవీణ్ హర్షం ప్రకటించారు. పెదకూరపాడు నియోజక వర్గంలోని బీసీలను అన్నివిధాలా ఆదుకుంటానని, అందరికీ సంక్షేమంకోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమావేశంలో వెన్నా సాంబశివారెడ్డి, ఎఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, గుంజా గంగారావు, అక్కల వెంకట రామిరెడ్డి, హనుమంతరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలోచేరిక.. బెల్లంకొండ మండలంలోని 30 కుటుంబాలు పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. బెల్లంకొండ గ్రామానికి చెందిన 15 కుటుంబాలు, న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌కు చెందిన 15 కుటుంబాలు టీడీపీ అభ్యర్థి బాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. బుధవారం రాత్రి బెల్లంకొండ మండలంలోని న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్, మాచాయపాలెం గ్రామాల్లో భాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


హుస్సేన్‌నగరంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ప్రవీణ్ సతీమణి లావణ్య

పెదకూరపాడులో పసుపు జెండా ఎగరాలి

పెదకూరపాడు, మార్చి 27 : పెదకూరపాడు నియోజక వర్గంలో ఈ సారి పసుపు జెండా రెపరెప లాడుతుందని నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య అన్నారు. మండలంలోని హుస్సేన్‌నగరం గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామగ్రామాన వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తుందన్నారు. టీడీపీ రూపొందించిన సూపర్ 6 పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలును ఎంపీగా, భాష్యం ప్రవీణ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు నెల్లూరి మల్లిఖార్జున్, జిల్లా నేతలు లీలా కుమారి, షేక్ ముంతాజ్, కావూరి సుజాత, సరిపూడి కృష్ణ కుమారి, జనసేన మండల అధ్యక్షులు మల్లెల వెంకట చలపతిరావు, కందుల లక్ష్మీకాంత్, మాజీ సర్పంచ్ నెల్లూరి సుబ్బాయమ్మ , టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటును స్వేచ్ఛగా వినియోగించు కోవాలి

నకరికల్లు, మార్చి 27 : స్వేచ్ఛాయుతంగా ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించు కోవాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు అన్నారు. బుధవారం నకరికల్లు, చాగల్లు గ్రామాల్లో ఎస్ఐ పీ.రాంబాబు, పోలీసు సిబ్బంది సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు చర్యలను నిర్వహిస్తున్నట్టు సీఐ ఎం రాంబాబు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి

నకరికల్లు, మార్చి 27 : ఎన్నికల నియమావళికి అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాదు అధికారులను ఆదేశించారు. బుధవారం నకరికల్లులోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ప్రతి పోలింగ్ కేంద్రం ఉండాలని, ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వీఆవో, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కోడ్ అమలులోనూ రంగులు చెరిపేయరా ?

● ఎన్నికల నియామవళి అధికారి శంకర్‌రావు ఆగ్రహం

రెంటచింతల,మార్చి 27: ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు చేయకపోవడంపై ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలు అధికారి పెదప్రోలు శంకరరావు మండి పడ్డారు. బుధవారం ఆయన రెంటాల, గోలి తదితర గ్రామాల్లో పర్యటించారు. రెంటాలలోని ఒక వీధిలో మాజీ సీఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు తొడిగి రంగులు మార్చకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాగైతే ఇతర పార్టీలకు మనం ఏం సమాధానం చెప్తామని కార్యదర్శి శౌరీ కుమారిని ప్రశ్నించారు. వెంటనే విగ్రహానికి తెల్ల రంగు వేసి తనకు ఫోటోలు చూపించాలని ఆదేశించారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీ

రెంటచింతల,మార్చి 27:సార్వత్రిక ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో నగదు రవాణాపై అధికారులు నిఘాపెట్టారు. అందులో భాగంగా మండలానికో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కె.పాపయ్య నేతృత్వంలో పలు వాహనాలను రక్షణ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రాజకీయపార్టీల నేతలు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేల విలువ కన్నా ఎక్కువ సామగ్రి రవాణా చేయడం నిషేధమన్నారు. భూములు, స్థిరాస్తుల కొనుగోలుకు నగదు తీసుకెళ్తుంటే లావాదేవీల వివరాలు, రసీదులు చూపించాలని స్పష్టం చేశారు.

పల్నాడు వార్తలు



మృతిచెందిన సిబ్బంది కుటుంబ సభ్యులకు చెక్కు అందజేసి, ఓదారుస్తున్న ఎస్పీ రవిశంకరరెడ్డి

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

నరసరావుపేట లీగల్, మార్చి 27: రోడ్డు ప్రమాదంలో మరణించిన తోటి కానిస్టేబుల్ కుటుంబానికి పల్నాడు జిల్లా పోలీసులు తమ ఒక్కరోజు వేతనాన్ని ఆర్థికసాయంగా అందజేశారు. 2011 బ్యాచ్‌కి చెందిన ఎస్.అశోక్ పల్నాడు జిల్లా యడ్లపాడు పోలీసు స్టేషన్‌లో సేవలు అందిస్తూ ఈ నెల 6వ తేదీన కోటప్పకొండలో బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు వెళ్తూ చిలకలూరిపేట పట్టణ శివారులో వెనుక నుంచి టిప్పర్ ఢీకొనటంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్ కుటుంబానికి బుధవారం జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి చేతుల మీదుగా అశోక్ కుటుంబానికి తోటి బ్యాచ్ కానిస్టేబుళ్ళు రూ.8లక్షలు నగదును ఎస్పీ చేతుల మీదుగా అశోక్ భార్య లక్ష్మీదేవికి అందజేశారు. కాగా పల్నాడు జిల్లా ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా సేవలు అందిస్తూ ఈ నెల 3న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోపిరెడ్డి కుటుంబానికి పోలీసు అసోసియేషన్ నుంచి చేయూత పథకం కింద రూ.లక్ష చెక్కును, ఏఆర్ విభాగం నుంచి రూ.93వేల నగదును గోపిరెడ్డి భార్య పూర్ణిమకు ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ 2011 బ్యాచ్ పోలీసుల ఐకమత్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యాలరావు, సిబ్బంది అనంత్, శివప్రసాదు, రాయపురెడ్డి, బాషా, మధుబాబు, శివరామ ప్రసాదు, రత్న కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

శావల్యాపురం, మార్చి 27: స్థానిక జడ్పీ పాఠశాలలోని పది పరీక్ష్యా కేంద్రంలో ఈ నెల 18న ప్రారంభమైన పది పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన సోషల్ పరీక్షకు 280మంది హాజరు కావాల్సి ఉండగా 268మంది హాజరయ్యారని, 12మంది గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సునీల్ చౌదరి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డీవైఈవో వేణుగోపాలరావు, ఆర్డీవో కార్యాలయ డీటీ నాగేశ్వరరావు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. డీవైఈవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పది పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిశాయన్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు సహకరించిన పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, పంచాయతీ రాజ్‌శాఖల సిబ్బందికి పరీక్షల చీఫ్ సునీల్‌చౌదరి, డిపార్ట్‌మెంట్ అధికారులు కిరణ్‌బాబు, మురళీకృష్ణలు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తున్న బాలికలు

● నూజెండ్ల: మండలంలో పదో తరగతి పరీక్షలకు 420మంది విద్యార్థులు నూజెండ్ల జెడ్పీ పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా రెండు సెంటర్లలో ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు విద్యార్థులు అన్ని పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈవో రవిచంద్ర తెలిపారు.

పరీక్షా కేంద్రంలో స్క్వాడ్ తనిఖీ

రొంపిచర్ల, మార్చి 27: మండలంలోని రొంపిచర్ల 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్, వినుకొండ ఎంఈవో జఫ్రుల్లా బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదులను కలియతిరిగి విద్యార్థులు పరీక్షా రాసే విధానాన్ని పరిశీలించారు. ఆయనవెంట చీఫ్, డిపార్టుమెంటల్ అధికారులు ఉన్నారు. మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం పరీక్షా కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నాయి.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి

రోడ్డుపక్కన మట్టికుప్పల తొలగింపు

నరసరావుపేట రూరల్, మార్చి 27: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏళ్ళ తరబడి పేరుకుపోయిన మట్టి కుప్పలను ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ అధికారులు తొలగిస్తున్నారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గత కొన్ని సంవత్సరాలుగా వివిధ ప్రాంతాలలో పేరుకుపోయిన బిల్డింగ్ మెటీరియల్, పెద్ద పెద్ద మట్టి కుప్పలను గుర్తించి వాటిని తొలగించేందుకు ఒక జేసీబీ రెండు ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురు, వరవకట్ట న్యూ ఆంధ్ర యూపీ స్కూల్ వెనుక వైపు ఉన్న బిల్డింగ్ మెటీరియల్, మట్టి కుప్పలను జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి మాట్లాడుతూ తమ ఇంటి ముందు ఉన్న కంకరరాళ్లు, ఇటుకరాళ్ల బిల్డింగ్ మెటీరియల్స్, ఇతర భవన నిర్మాణానికి సంబంధించిన వస్తువులు రోడ్లపై కుప్పలుగా ఏవైనా ఉంటే వాటిని తొలగించాలని లేకుంటే పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా వాటన్నింటిని తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న వేదపండితులు, అర్చకులు

ఘనంగా మహంకాళి అమ్మవారి గ్రామోత్సవం

నరసరావుపేట రూరల్, మార్చి 27: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి 49వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా బుధవారం మహంకాళి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఇసప్పాలెంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం తిరునాళ్ళ మహోత్సవం రెండో రోజున పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇసప్పాలెం గ్రామం, నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం 6గంటల నుంచి ఇసప్పాలెం గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను యనమంద్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో దేవాలయ అర్చకస్వామి కొత్తలంక రుద్ర వీరకాళికాసత్య కార్తికేయ, నందూరి కాలి కృష్ణ పూజా, హోమం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డి తెలిపారు. అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు కె.వెంకటబదరీ నారాయణ, బూసా సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ టౌన్, మార్చి 27: ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి నర్సరావుపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి లావు కృష్ణదేవరాయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సవాళ్లు, ఒడిదుడుకులు ఉంటాయని తెలిసినా రాజకీయాల్లోకి వచ్చింది జన్మభూమి రుణం తీర్చుకోవడానికేనన్నారు. వైసీపీ ఎమ్మెల్యే బొల్లాలా దోచుకోవడం దాచుకోవడం కాకుండా ఈ ప్రాంతానికి నిజంగా మేలు చేసే ఏకైక సంకల్పంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పల్నాడు ప్రాంత కరువు, నీటి కష్టాలు తెలిసిన వ్యక్తిగా వరికపూడిశల ప్రాజెక్టు కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎంతో చిత్తశుదితో కృషిచేశారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ తరపున గత ప్రభుత్వం, ప్రస్తుతం ఎంపీగా కృష్ణదేవరాయులు ఎంతోకృషిచేసినా, స్థానిక శాసనసభ్యుడు బొల్లా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేక ప్రాజెక్టును గాలికి వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం హయంలో తాను చంద్రబాబునాయుడును అడిగి రూ.344 కోట్ల నిధులు తీసుకువచ్చామన్నారు. కానీ 2019లో అధికారం కోల్పోవడం బొల్లాలాంటి వ్యక్తులు ఎమ్మెల్యేలు కావడం వరికపూడిశలకు శాపంగా మారిందని, వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా పక్కన పెట్టేసిందని దుయ్యబట్టారు. ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా లావు కృష్ణదేవరాయులను గెలిపిస్తే వినుకొండలో ఎరువుల రేక్‌పాయింట్ ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. రేక్‌పాయింట్ వలన ఎరువులు దిగుమతి చేసుకోవడంతోపాటు గూడ్సు రైల్ సౌకర్యంతో అనేక రకాలైన వస్తువులు ఎగుమతి చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. పల్నాడు ప్రాంతంలో మిర్చి పంటను ఎక్కువ సాగు చేస్తున్నారని ఇక్కడే క్రయవిక్రయాలు జరుపుకునేలా దుర్గి మిర్చి యార్డును అందుబాటులోకి తెస్తామని అందుకు అవసరమైన అనుమతులు తీసుకువస్తామన్నారు. అలాగే ఎరువులు, పురుగు మందులు విత్తనాల వ్యాపారుల సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంపీ కృష్ణదేవరాయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అధికారం ఇస్తే వచ్చే ఐదేళ్లు ఏం చేస్తున్నామో చెబుతున్నామన్నారు. ప్రజలు విశ్వాసం ఉంచి గెలిపిస్తే స్థానికంగా అన్నివిధాలా అభివృద్ధి, రోడ్లు, ఇంటింటికీ కుళాయి, సామాజిక అవసరాలపై ప్రధానంగా దృష్టి పెడతామని హామీఇచ్చారు. ఎరువుల వ్యాపారులకు నూతన ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తమదన్నారు. స్టాక్ అందుబాటులో ఉంచడం వేధింపులు లేని విధానంలో అమలు చేసేందుకు భరోసా ఇస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ పదవిలో, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో పట్టణ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టమూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు యాగంటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో వరికపూడిసెల పూర్తిచేస్తాం

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



రేమిడిచర్లలో జరిగిన ప్రచార సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పక్కన లావు

బొల్లాపల్లి, మార్చి 27: కూటమి ప్రభుత్వం రాగానే ఐదు సంవత్సరాల్లో పల్నాడు ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వరికపూడిసెల ఎత్తిపోతలను పూర్తిచేస్తామన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు పల్నాడు ప్రాంతానికి అత్యంత కీలకమైన ఎత్తిపోతలను పూర్తి చేస్తామన్నారు. వైసీపీ గ్రహణం అడ్డురాకుంటే ఐదేళ్ళ క్రితమే పూర్తయ్యేదని తెలిపారు. మండలంలోని రేమిడిచర్లలో బుధవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి జీవీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో రోడ్ షో నిర్వహించారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెరగని, సంక్షేమం ఆగని పాలన కావాలంటే కూటమి ప్రభుత్వమే రావాలన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధాలా అధోగతిపాలు చేసిన జగన్ దగాకోరు పాలన తెలుగుదేశం విధానాలకు తేడా ఏంటో ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరికపూడిసెల ప్రాజెక్టును తాను బాధ్యత తీసుకొని కూటమి ప్రభుత్వం రాగానే త్వరితగతిన పనులు ప్రారంభించి నీరు అందిస్తామన్నారు. దివాలాతీసిన రాష్ట్రానికి జన వసంతాలు అందించాలనే ఏకైక లక్ష్యంతో మూడు పార్టీలు జతకట్టాయని, ప్రతి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు విజయఢంకా మోగిస్తారన్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటంలో పని చేయటానికి ప్రజలంతా సిద్ధం అంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జరపాల గోవిందునాయక్, పెమ్మసాని నాగేశ్వరరావు, పసల వెంకటనారాయణ, బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వాగ్యానాయక్, ఆయా గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పది కుటుంబాలు టీడీపీలో చేరిక

బొల్లాపల్లి, మార్చి 27 : మండలంలోని గుంటపల్లిలో వైసీపీ నుంచి పది కుటుంబాలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు జీవీ ఆంజనేయులు, జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ నిశ్శంకర శ్రీనివాసరావుల సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరికి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, దాసరి కోటేశ్వరరావు, హనుమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి పాటుపడేవారినే ఎన్నుకోవాలి

● ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈపూరు, మార్చి 27: సమాజాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడే నాయకులను ఎన్నుకోవాలని నర్సరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈపూరు మండలం కొండ్రముట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నాయకులకు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు వృథా చేసుకోవద్దన్నారు. అభివృద్ధి ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో ఆలోచించి ఓట్లను వేయాలన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం అనుమతి కోసం చాలా కష్టపడ్డానన్నారు. వినుకొండ ప్రాంతం చాలా వెనుకబడిందని, అభివృద్ధి జరగాలంటే వరికపూడిశెల ప్రాజెక్టు పూర్తిచేస్తేనే అది సాధ్యమన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టుకు కేంద్రం రెండు అనుమతులు ఇవ్వలేదని, వరికెపూడిశెల ప్రాజెక్టుకు ఇచ్చారన్నారు. పర్యావరణ అనుమతితో పాటు రక్షిత అటవీప్రాంత నిరభ్యంతరపత్రం కూడా ఇచ్చారన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చలేక పోయిందన్నారు. ఎన్నికల అనంతరం జీవీతో కలిసి బాధ్యతగా ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే బొల్లా ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ఇష్టానుసారం మాట్లాడతాడన్నారు. ప్రజలు ఎంత కష్టాన్ని అయినా భరించగలరు కాని అహంకారాన్ని భరించరన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిందని ఆడబిడ్డలు చాలా బాధపడుతున్నారన్నారు. ఆదాయం పెంచుకోవడం కోసం చంద్రబాబు మహిళలకోసం మూడు పథకాలను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ నాయకులు నలబోలు విష్ణు, లెనిన్, టీడీపీ నాయకులు రాపర్ల జగ్గారావు, తిరుమలశెట్టి బాలయ్య, ఐనాల కోటేశ్వరరావు, బయలడుగు రామయ్య, నర్రా కిశోర్, బొల్లా వెంకట కోటయ్య, ముండ్రు రామకృష్ణ, వేణు, నెల్లూరి శాంతారావు, కూరాకుల శ్రీనివాసరావు, వారాంజినేయులు, హనుమయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, బోడపాటి అంజయ్య, కాటం కోటేశ్వరరావు, సుబ్బరాయుడు, శ్రీనివాసరెడ్డి, గుప్తా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌లో ఏమి తరలించారు: జీవీ

వినుకొండ, మార్చి27: తాడేపల్లి ప్యాలెస్ నుంచి గుట్టుగా అగమేఘాల మీద కంటైనర్‌లో ఏం తరలించారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూజండ్ల మండలం చెరుకుంపాలెం గ్రామానికి చెందిన తాళ్ళూరి సీతారామయ్య, రావులపల్లి వెంకటేశ్వర్లుతోపాటు 10 యాదవ సామాజివర్గ కుటుంబాలు వైసీపీ నుంచి బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి నర్సరావుపేట పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జీవీ మాట్లడుతూ విశాఖలో ఒక వైపు డ్రగ్ కంటైనర్ కలకలం మరో వైపు ఓటమి మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో సీఎం ఇంటి నుంచి గుట్టుగా సాగిపోయిన కంటైనర్‌పై ఎన్నో అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అక్కడ నుంచి డబ్బులు తరలించారా, పక్క రాష్ట్రం తెలంగాణలో జరుగుతున్న ట్యాపింగ్ విచారణలను చూసి భయపడి తమ వార్ రూమ్‌లను ముందే సర్దేశారా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. ఇంతకాలం సాగిన అవినీతి అక్రమాల పత్రాల రికార్డులను మాయంచేశారా వీటన్నింటిపై ముఖ్యమంత్రి జగన్ లేదా ఆయన సలహా దారుడు సజ్జల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీ కృష్ణదేవరాయులు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండి మంచి చేస్తానన్న నమ్మకం ఉంటే తమకు ఓటు వేయండని ప్రజలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ వినుకొండలో బొల్లా బ్రహ్మ నాయుడు అరాచకాలు, రౌడీయిజం సహించలేక కులమతాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బొల్లా ఓటమి ఖాయమని వినుకొండ ప్రజలకు విముక్తే లక్ష్యంగా కూటమి పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అది జరిగి తీరుతుందని, బొల్లా కబంధ హస్తాల నుంచి వినుకొండ ప్రజలకు త్వరలో స్వేచ్ఛ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, పోకిరి రామయ్య, నంబుల గుర్నాదం తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన చెరుకుంపాలెం గ్రామస్థులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

ఆర్టీసీ బస్సు కిందపడి ఉద్యోగి మృతి

వినుకొండ టౌన్, మార్చి 27: ఆర్టీసీ బస్సు కింద పడి, ఆర్టీసీ గ్యారేజి ఉద్యోగి మృతిచెందిన సంఘటన వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే వినుకొండ ఆర్టీసీ గ్యారేజిలో అసిస్టెంట్ మెకానిక్‌గా పనిచేస్తున్న ఎస్కే సుభాని (58) విజయవాడ నుంచి గిద్దలూరు వెళ్తున్న బస్సు డిపోలోకి వస్తుండగా బస్సు ఢీకొని కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నైట్ డ్యూటీకి వచ్చి, రికార్డులో సంతకంచేసి టీ తాగేందుకు బయటకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కార్మికులు తెలిపారు. నిత్యం గుంటూరు నుంచి డైలీసర్వీస్ చేస్తున్నట్లు కార్మికులు తెలిపారు. గిద్దలూరు బస్సు డ్రైవర్ బస్సును డిపో ఆవరణలో నిలిపివేసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. మృతుడి వివరాలను వెల్లడించేందుకు డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ నిరాకరించారు.

పాము కాటుకు యువరైతు మృతి

ఈపూరు, మార్చి 27: పాముకాటుకు యువ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని బొగ్గరం గ్రామంలో బుధవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పసుపులేటి కొండలు (37) ఆంజనేయ స్వామి గుడి సమీపంలో కొంకేరు వాగుకు ఆనుకొని ఉన్న అర ఎకరం పొలంలో వరిపైరు సాగు చేస్తున్నాడు. పంటకు పురుగు నివారణ మందు స్ప్రే చేస్తుండగా పాముకాటు వేసింది. గట్టుమీదకు వచ్చి అక్కడ ఉన్నవారికి తనను పాము కరిచినట్లు చెప్పి పడిపోయాడు. ఇంటికి తీసుకు వస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతినికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.



పసుపులేటి కొండలు (ఫైల్ ఫొటో)

నేడు ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం

వినుకొండ, మార్చి 27 : వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్‌కలాం థెరిస్సా సేవా సొసైటీ వ్యవస్థాపకులు చందోలు నాగవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ పట్టణ సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో గర్భిణులకు కాన్పుల సమయంలో రక్తం చాలా అవసరమని గుర్తించి రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రక్తదాతలు ఇచ్చే రక్తం వలన తల్లీబిడ్డలకు ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చన్నారు. ప్రతిఒక్కరు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వేల్పూరు (శావల్యాపురం) మార్చి 27: మండలంలోని వేల్పూరులోని భూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మూడురోజుల పాటు జరుగుతున్న 10వవార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ పూజారి మారుతీ రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించి అనంతరం మేళతాళాలతో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధులలో ఊరేగించి ఘనంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, కుమారులు శ్రీనివాసరావు, గిరిబాబులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. పూజారులు స్వామివారికి మంగళహారతులిచ్చి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన వితరణ చేశారు.



టీడీపీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

వైసీపీ పాలనలో మంట గలిసిన ప్రజాస్వామ్యం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: వైసీపీ నియంతృత్వ పాలనలో ప్రజాస్వామ్యం పూర్తిస్థాయిలో మంట గలిసిందని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సింది అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం. కాని అప్పులు, తిప్పలు కాదనే విషయాన్ని ఐదు సంవత్సరాల్లో అందరికీ అర్థమయ్యేలాచేసి జగన్ తన గొయ్యి తానే తవ్వుకున్నాడని ఆయన ఎద్దేవా చేశాడు. బుధవారం యడ్లపాడు మండలం కొండవీడుకు చెందిన 30కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని ప్రత్తిపాటి పుల్లారావు నివాసంలో వారంతా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ యువతకు కావాల్సిన భరోసా, నమ్మకాన్ని జగన్ ఇవ్వలేదన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే 1వ తేదీనే లబ్ధిదారుల ఇంటికే నాలుగు వేల రూపాయల పింఛన్‌తోపాటు ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీల పెంపుదల ఉండదని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. పేద వారి కడుపు నింపే అన్న క్యాంటీన్‌లు తిరిగి తెరుస్తామని, నాసిరకం మద్యాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని, గంజాయి, డ్రగ్స్ లేని నవ్యాంధ్రను సాకారం చేసి చూపటంతో పాటు సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్యక్రమంలో సాకారంచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. ఐదు సంవత్సరాల్లో 20లక్షలమంది యువతకు ఉద్యోగాలు, అవి వచ్చేంతవరకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, ఎలాంటి పరిమితులు లేకుండా బడికి వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేలు ఆర్థికసాయం, అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20వేలు ఆర్థికసాయం చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

బ్రాహ్మణులపై దాడులు హేయం

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: అర్చకుడు అంటే భగవంతుడికి, భక్తుడికి మధ్య అనుసంధానకర్తగా భావించి కాళ్ళకు మొక్కే సంప్రదాయం మనదని, అటువంటి పూజారులను భక్తుల సమక్షంలోనే కాలితో తన్నటం, కొట్టడం హేయమైన రాక్షసచర్య అని స్థానిక బ్రాహ్మణ సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు. బుధవారం దీనిపై సంఘనేతలు స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాకినాడలోని దేవాలయం వీధిలో శివాలయంలో అర్చకులపై వైసీపీ నేత చేసిన దాడిని, వైసీపీ నేతల అధికార మదానికి మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపునకు ఈ సంఘటన నిదర్శనం అన్నారు. ఏకంగా గుడిలోనే అర్చకులపై దాడిచేసిన నిందితుడిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వారంతా కోరారు. కార్యక్రమంలో శనగల హనుమత్‌శాస్త్రి, శనగవరపు గోపినాథ్ శాస్త్రి, కంతేటి సీతారామ శాస్త్రి, నిడుముక్కల నాగరాజు శర్మ, దుర్భకు రామ కోటయ్య శాస్త్రి, పత్రి వంశీకృష్ణ, కృష్ణమూర్తుల లక్ష్మీనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

● కాకినాడలో అర్చక స్వాములు శాయిశర్మ, విజయ్‌కుమార్‌శర్మలపై జరిగిన దాడిని స్థానిక ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి నాయకులు బుధవారం ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మానవ హక్కుల కమిషన్ వారు దీనిపై స్పందించి సుమోటోగా కేసును స్వీకరించి విచారణ చేయాలని కోరారు. వీరిలో సంఘం నాయకులు సీహెచ్ విజయ కుమార్, ఏకా మారుతీ రామశర్మ, పీ రామచంద్రమౌళి, వీ శరత్ కుమార్ శాస్త్రిలు ఉన్నారు.

మోడల్ పాఠశాలలో ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నూజెండ్ల, మార్చి 27: పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్‌లు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ పద్మజ బుధవారం తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈటీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని పాఠశాలలో అప్లికేషన్ అందజేయాలన్నారు. అడ్మిషన్ పొందిన ఆడ పిల్లలకు మోడల్ స్కూల్ ప్రాంగణంలో హాస్టల్‌లో వసతి కల్పిస్తామన్నారు. మే 22వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

30న వైసీపీ కార్యకర్తల సమావేశం

చిలకలూరిపేట అర్బన్, మార్చి 27: ఈ నెల 30వ తేదీన చిలకలూరిపేట నియోజకవర్గస్థాయిలో వైసీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వైసీపీ అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌తో కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ నెల 30న ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి పార్టీలోని అన్ని స్థాయిలకు చెందిన వారంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు దరఖాస్తు రుసుం

● రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ఇక్కట్లు

శావల్యాపురం, మార్చి 27: రీసర్వేలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రీసర్వేలో అధికారులు చేసిన తప్పులను సవరణ చేసుకునేందుకు రైతులే రుసుములు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని కనమర్లపూడి, పోట్లూరు, వేల్పూరు, పిచికలపాలెం రెవెన్యూ గ్రామాలలో రీసర్వే పూర్తికాగా ప్రభుత్వం రైతులకు అందించిన పాసుపుస్తకాలలో పలు తప్పులు నమోదయ్యాయి. రైతులకిచ్చిన 9(2) పత్రాల్లోని విస్తీర్ణాలకు, పాసు పుస్తకాల్లోని విస్తీర్ణాలకు వ్యత్యాసాలు ఉండడం, ఒక రైతు పొలాన్ని మరొకరికి నమోదు చేయడం, చనిపోయిన వ్యక్తుల పేర్లతో పాసుపుస్తకాలు ఇవ్వడంతో పలు గ్రామాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాసు పుస్తకాలలో నమోదైన తప్పులను సవరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో రైతులు దరఖాస్తులు చేసుకొనేందుకు సచివాలయాలకు వెళితే ఒక్కో ఎల్‌పీఎం నెంబర్ సవరణ చేసేందుకు రూ.50, మ్యుటేషన్‌లకు రూ.150 రుసుములు వసూలు చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చేసిన తప్పులకు రైతులపై భారం మోపితే ఎలాగని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు దరఖాస్తులు చేసుకునేందుకు సర్వర్ లేదని అధికారులు జాప్యం చేస్తుండడంతో బ్యాంక్‌లలో రుణాలు పొందిన రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి రైతులపై దరఖాస్తు రుసుముల భారాన్ని మోపకుండా సవరణలు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా సరిహద్దు చెక్ పోస్టులో పోలీసుల తనిఖీలు

రొంపిచర్ల, మార్చి 27: మండలంలోని అన్నవరప్పాడు వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో చెక్ పోస్టును బుధవారం ఏర్పాటుచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లా చెక్ పోస్టును ఇక్కడ ఏర్పాటుచేశారు. హైవేపై వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీచేశారు. అక్రమ మద్యం, నగదు రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. తనిఖీల్లో పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

50 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక

వినుకొండ, మార్చి 27: స్థానిక వీఎల్ఎస్ లాడ్జిలో బుధవారం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశం సందర్భంగా కంచర్ల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది గర్నెపూడి అలెగ్జాండర్ పార్టీ కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పార్టీ అధిస్టానం ఎవరిని నిర్ణయించినా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ అన్యాయం, అక్రమాల పాలన సాగించి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి దేశంలో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.